www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 22 మే 2023

మహిళా ఉపాధి కూలీ మృతి



ప్రజాశక్తి - మండపేట

మండలంలోని ద్వారపూడికి చెందిన ఉపాధి కూలీ నిమ్మతి రాజేశ్వరి(62) శనివారం రాత్రి మతి చెందింది. గ్రామ శివారు నల్లకాలువలో పూడికతీత పనికి వెళ్లింది. ఈమె పనిచేస్తుండగా ఎండతీవ్రత ఎక్కుకవగా ఉండటంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. వెంటనే తోటి కూలీలు ఆమెను గ్రామంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో ఆమె శనివారం రాత్రి మృతి చెందింది.

కూలి అరకొరే...

- ఆర్థిక ఇబ్బందులతో ఉపాధి కూలీల సతమతం
- రూ.600లకు పెంచాలని డిమాండ్
- సాంకేతిక సమస్యలతో అష్టకష్టాలు

ప్రజాశక్తి - అమలాపురం

ఎంత పనిచేసినా ఉపాధి కూలీలకు కూలి అరకొరగానే దక్కుతోంది. ఇది కూడా ఆలస్యం కావడంతో కూలీలు ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో కూలీలకు ఉపాధి హామీ చట్టం కల్పిస్తున్న పనులే దిక్కు. అయితే ఈ పనులు కూడా పూర్తిస్థాయిలో అందట్లేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా కనీసంగా రోజువారీ కూలి రూ.600 చేయాలని పలువురు కోరుతున్నారు. అలాగే కుటుంబం అంతటికీ కాకుండా కుటుంబంలో ఒక్కో సభ్యునికి 100 రోజులు పని కల్పించాలని కోరుతున్నారు. లేకుంటే జీవనం సాగించలేమని వారు వాపోతున్నారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం బడా పెట్టుబడిదార్లకు కార్పొరేట్లకు లక్షల కోట్లు సబ్సిడీగా ఇస్తూ పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టానికి నిధుల్లో కోతను విధిస్తోంది. ఫలితంగా పనులు క్రమంగా తగ్గిపోతున్నాయి. కూలీలకు పూర్తిస్థాయిలో పనిదొరకని పరిస్థితి నెలకొంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల దృష్ట్యా ఉపాధి హామీ కూలీని రూ.600కు పెంచాలని ప్రజాసంఘాల నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. అయినా పాలకుల్లో చలనం లేదు.

రెండు పూటల పనితో ఇబ్బందులు

ఉపాధి హామీ చట్టంలో రెండు పూటల పనితో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఎండల నేపథ్యంలో పని ప్రదేశంలో ఎలాంటి మౌలిక వసతులను కల్పించట్లేదు. అక్కడక్కడా చిన్నచిన్న టెంట్లు మాత్రం వేసి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో ఎండలను తాళలేక కూలీలు చెట్లనీడను ఆశ్రయించాల్సిన పరిస్థితి. గతంలో సమ్మర్ అలవెన్సులను ఇచ్చేవారు. ప్రస్తుతం వీటిని కేంద్రం నిలిపేసింది. ఎప్పటిలానే 40 శాతం సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని కూలీలు కోరుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. 100 రోజులు పూర్తి చేసిన కుటుంబానికి మళ్లీ పనులు కల్పించట్లేదు. దీంతో వారు ఏ పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. వంద రోజులు పని పూర్తిచేసిన కుటుంబానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పని చూపాల్సిన అవసరం ఉంది. ఉపాధిని గ్రామాలకే పరిమితం చేస్తున్నారు. దీంతో పట్టణాల్లో కూలీలు పనుల్లేక అర్థాకలితో అలమటిస్తున్నారు. గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ పని కల్పించాలని, పని చేసే చోట కనీస సౌకర్యాలైన టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు ఇవ్వాలని కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తాగునీటికి రూ.10, గునపం, పారకు రూ.50, తట్టకు రూ.20 ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.



ఎండలోనే పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ఆన్‌లైన్ మస్టర్లతో ఇబ్బందులు

గతంలో ఆఫ్‌లైన్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ లేదా మేట్లు మస్టర్లు వేసేవారు. పని చేయడానికి ముందుగానే ఈ మస్టర్ల ప్రక్రియ జరిగేది. ప్రస్తుతం ఆన్‌లైన్ మస్టర్లను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో రెండు సార్లు మస్టర్లు వేయాల్సి వస్తుంది. పని ప్రారంభమైనప్పుడు మధ్యాహ్నం 12 గంటల తరువాత మస్టర్లు వేస్తున్నారు. ఉపాధి కూలీలు వేసవి నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకూ ఉపాధి పనులను చేస్తున్నారు. ఉదయం మస్టరు అనంతరం పనులను పూర్తి చేసుకుని 11 గంటలకు వెళ్లిపోతున్నారు. కొత్త విధానం వల్ల వారు 12 గంటల వరకూ ఎండలోనే మస్టరు కోసం పడిగాపులు కాస్తున్నారు. సాంకేతక కారణాల వల్ల మస్టర్లు కూడా ఆలస్యం అవుతున్నాయి. దీంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాత పద్ధతిలోనే మస్టర్లు వేయాలని వారు కోరుతున్నారు.

సిబ్బందికీ తప్పని తిప్పలు

ఆన్‌లైన్ విధానంతో ఉపాధి సిబ్బందికీ తిప్పలు తప్పడం లేదు. రెండు పూటల మస్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వారిపై మరింత భారాన్ని మోపింది. అంతేకాకుండా తగిన సిబ్బంది లేకపోవడంతో పక్కగ్రామాలకూ వారే ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఉపాధి డేటాను ఎరోజుకారోజు ఆన్‌లైన్ చేయాల్సి రావడంతో రాత్రి వేళల్లో సైతం కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేయాల్సి వస్తుంది. కొన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ సరిగా పనిచేయకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్నెట్ సరిగ్గా పనిచేయని ప్రదేశాల్లో ఆఫ్‌లైన్‌లో మస్టర్లు నమోదు చేసే అవకాశం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

కూలి రూ.600 చేయాలి



ఉపాధి హామీ చట్టంలో రోజువారీ కూలిని రూ.600 పెంచాలి. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని నేపథ్యంలో కుటుంబ పోషణకు ఇప్పుడిచ్చే కూలి ఏ మూలకూ సరిపోదు. సమ్మర్ అలవెన్సులు నిలిపేయడం దారుణం. సమ్మర్ అలవెన్సులు చెల్లించాలి. రెండు పూటల పని విధానం అని రద్దు చేయాలి. ప్రభుత్వం స్పందించకుంటే వీటిపై భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తాం.

- కారెం వెంకటేశ్వరరావు
రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కార్మిక సంఘం

సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలి

ప్రతి ఏటా వేసవిలో సమ్మర్ అలవెన్సు ఇచ్చేవారు. ఇప్పుడు వీటిని రద్దు చేశామని చెబుతున్నారు. రెండు పూటలా పని విధానంతో అనేక అవస్థలు పడుతున్నాం. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. ఎండలో పనిచేస్తే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలుచోట్ల వడదెబ్బతో ఉపాధి కూలీలు మృతి చెందారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక పూట మాత్రమే పనులు నిర్వహించాలి.

- బి.దుర్గ, ఉపాధి కూలీ



మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - ఐ.పోలవరం

అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. కేశనకుర్రు పంచాయతీ పరిధిలో పెదలంకలో అంబేద్కర్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. మోకా బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విక్టర్ ప్రసాద్, టిడిపి అమలాపురం పార్లమెంటు పార్టీ ఇన్‌ఛార్జి గంటి హరీష్‌మాథూర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విక్టర్ ప్రసాదమ్ మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎస్‌సిలపై పెట్టిన అక్రమం కేసులను తొలిగిస్తామని హామీ ఇచ్చారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మురమళ్ల సెంటర్‌లో ఉన్న అంబేద్కర్, జిఎంసి బాలయోగి, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి నాగేశ్వరరావు, మాల మహనాడు జిల్లా నాయకుడు రేవు శ్రీను మడలంలో దళితుల సమస్యలపై విక్టర్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దుక్కిపాటి సత్యనారాయణ, కాశి శ్రీహరి, బి.జేమ్స్‌పాల్, రేవు అప్పలస్వామి, ఎమ్‌టి.ప్రసాద్, బి.శ్రీరాములు, కుంచె చినబాబు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎండలోనే పారిశుధ్య కార్మికులతో పనులు చేయిస్తున్నారన్నారు. కార్మికులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యతవహిస్తారు? అని ఆయన ప్రశ్నించారు. ముమ్మిడివరం నగర పంచాయతీలో పారిశుధ్య కార్మికులను కొం మంది శానిటేషన్ కార్యదర్శులు వేధిస్తున్నారన్నారు. కార్యదర్శులకు పనిపై సరైన అవగాహన లేదన్నారు. పనిచేసే కార్మికులు తక్కువగా ఉన్నారని, ఈ సమయంలో ఏ పనికి ప్రాధాన్యత ఇవ్వాలో కార్యదర్శులకు తెలియట్లేదన్నారు. కార్మికుల తక్కువగా ఉన్నప్పటికీ ప్రొటోకాల్ పేర బయట వ్యక్తుల పనులకు కార్మికులను కేటాయిస్తున్నారని తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీనిపై కమిషనర్, పాలక పక్షం స్పందించాలని డిమాండ్ చేశారు. బళ్లగేటు సెంటర్ వద్ద డ్రెయినేజీ మూసుకు పోయిందన్నారు. దీంతో నీరు నిలిచిపోతుందన్నారు. పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయన్నారు. సంబంధిత కార్యదర్శి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. డ్రెయినేజీని పూర్తిగా నిర్మించాలని డిమాండ్ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కార్మికుల సమయాన్ని కమిషనర్ మార్పు చేశారన్నారు. కాని సెక్రటరీలు ఆయన ఆదేశాలను బేఖాతరు చేస్తూ కార్మికులపై యథావిధిగా పనులు చేయిస్తున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తున్న కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారన్నారు. కార్మికులకు ఏదైనా జరిగితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సిఐటియు చూస్తూ ఊరుకోబోదన్నారు.



ఉప్పలగుప్తం మండలం బట్టుపాలెంలో రాజీవ్‌కు నివాళులర్పిస్తున్న గిడుగు రుద్రరాజు తదితరులు

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - మండపేట, ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ బట్టుపాలెంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్థంతిని నిర్వహించారు. ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ వ్యవస్థను అభివృద్ధి పథంలో నడిపించన ఘనత రాజీవ్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీకట్ల అబ్బాయి, యార్లగడ్డ రవీంద్ర, అయితాబత్తుల సుభాషిణి, ఆకుల వెంకటరెడ్డినాయుడు, నిమ్మకాయల నాగేంద్రప్రసాద్, డి.జయ, డి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండపేట మండలంలోని ఏడిదలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ 32వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్ దేశానికి చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాడిశెట్టి సత్యనారాయణ, వాసిరెడ్డి బాబూరావు, మగ్గం రాజు, గొడవల వెంకట సుబ్బారావు, ముగ్గులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో కానరాని సౌకర్యాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మండపేట

పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు చట్టబద్ధంగా అందించాల్సిన సేవలను నిర్వాహకులు గాలికి వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన మౌలిక సదుపాయాలకు వారు తిలోదకాలిస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో ఇంధనాన్ని విక్రయించడమే కాదు.. వినియోగదారులకు వాటిల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ మండపేటలో అవి ఎక్కడా అమలు కావడం లేదు. తనిఖీ చేయాల్సిన అధికారులూ పట్టించుకోవడం లేదు. పెట్రోల్‌బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లకు గాలిని ఉచితంగా నింపాలి. ప్రతి బంకులో గాలి నింపే యంత్రం విధిగా ఉండాలి. వాహనదారులు టైర్లలో గాలి నింపమని కోరితే కొన్ని బంకుల్లో నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. యంత్రం పని చేయడం లేదని, సిబ్బంది లేరని తప్పించుకుంటున్నారు. నగర శివారు ప్రాంతాల్లోని బంకుల్లోకి లారీలు, ట్రక్కుల వంటి భారీ వాహనాలు వస్తుంటాయి. వాటికి సైతం గాలి నింపేందుకు నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. చాలాచోట్ల యంత్రాలు కనిపించకుండా ఏర్పాటు చేసి వాడకుండా వదిలేస్తున్నారు. వాహనదారులకు తాగునీటితో పాటు మరుగుదొడ్ల సదుపాయాన్ని ఉచితంగా కల్పించాలి. అంతేకాకుండా బంకుల్లో పెట్రోల్‌ను పరీక్షించుకునేందుకు తగిన కిట్లను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలి. కాని ఇవేమీ ఇక్కడ బంకుల్లో మచ్చుకు కూడా కానరాని పరిస్థితి.



తాపేశ్వరం పెట్రోల్ బంకులో మూలకు చేరిన గాలిని నింపే యంత్రం



సత్యనాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

సత్యనాగేశ్వరరావుకు సత్కారం

ప్రజాశక్తి - మామిడికుదురు

టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోనం సత్యనాగేశ్వరరావు(బాబు) పుట్టినరోజు సందర్భంగా పలువురు ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఆయన పుట్టిన రోజు వేడుకలు ఆదివారం టిడిపి మండల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంటా నిర్వహించారు. పుట్టినరోజు కేక్‌ను కట్ చేసి పంచారు. పలువురు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెదపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆణిముత్యాలు'ను ఎయిడెడ్‌కూ వర్తింపజేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ విద్యాసంస్థల్లో 10వ తరగతి, ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట అందిస్తున్న ప్రోత్సాహకాలను ఎయిడెడ్ విద్యాసంస్థలకూ వర్తింపజేయాలని ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 10వ తరగతిలో మొదటి మూడు స్థానాల్లో, ఇంటర్‌లో మొదటి ర్యాంక్ వారికి సత్కారం, నగదు పురస్కారం అందిస్తున్నారన్నారు. రూ.5వేల నుంచి రూ.లక్ష వరకూ ఈ ప్రోత్సాహకాలు ఆయా స్థాయిలను బట్టి ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న ఎయిడెడ్ పాఠశాలలకూ ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. మేనేజ్‌మెంట్‌ను బట్టి విద్యార్థులపై వివక్ష చూపడం సరికాదన్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో ఆయన ఆదివారం ఫోన్‌లో మాట్లడారు. దీనిపై పునరాలోచిస్తామని మంత్రి తెలియజేశారని ఎంఎల్‌సి ఐవి తెలిపారు.

వీరేశ్వరస్వామిని దర్శించుకున్న ఆర్‌డిఒ దంపతులు

ఐ.పోలవరం : మురమళ్ల వీరేశ్వరస్వామిని అమలాపురం ఆర్‌డిఒ నెల్లి శ్రీవెంకటభోగవసంత రాయుడు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. వీరికి ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం వారిని పట్టువస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్ర పటం, ప్రసాదం అందించారు. ఆలయ ఛైర్మన్ పెన్మత్స వాసురాజు కార్యనిర్వాహయాణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ, సర్పంచ్ కాలే రాజబాబు వారి వెంట ఉన్నారు.

సర్పంచ్‌పై హెల్త్ సూపర్‌వైజర్ ఫిర్యాదు


కాట్రేనికోన : కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ తనపై దాడి చేశారని, అతనిపై చర్యలు తీసుకోవాలని కాట్రేనికోన పిహెచ్‌సిలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఉచ్చుల రాధాకృష్ణ సహెూద్యోగులతో కలిసి శనివారం కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాట్రేనికోన 3, 4 గ్రామ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పిలు బ్యాంకులో జాయింట్ అకౌంట్ తెరిచేందుకు ఈ నెల 18న సర్పంచ్ వెంకటసుధాకర్‌ను కలిసేందుకు వెళ్లారు. ఆరు నెలలుగా తనను ఎందుకు కలవలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి సంతకం పెట్టేందుకు నిరాకరించారు. వైద్యురాలు నీలిమకు ఫోన్ చేసి కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. వైద్యురాలు నీలిమ సర్దిచెప్పడంతో ఫణికుమార్, ఎం.శ్రీహరిలతో కలిసి రాధాకృష్ణ క్షమాపణ చెప్పేందుకు శనివారం సర్పంచి ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో సర్పంచ్ ఆగ్రహంతో తన చెంపపై కొట్టి దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే తనపై అధికారులు దుర్భాషలాడటమే కాకుండా, యూనియన్ నాయకులతో కలిసి కేసు పెడతామని బెదిరించారని సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో కాట్రేనికోన స్టేషన్‌లో సిఐ కొండయ్య వైద్యురాలు నీలిమ, లిఖిత, వైస్ ఎంపిపి సానబోయిన నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు సంసాని నాగేశ్వరరావులతో మాట్లాడారు.

పాలిసెట్‌లో ఆలమూరు విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

పాలిసెట్‌లో ఆలమూరు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుత్తుల వీరబ్రహ్మం మాస్టారు సారథ్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పాలిసెట్ కోచింగ్‌ను నిర్వహించారు. సుమారు 120 మంది విద్యార్థులు ఈ ఉచిత శిక్షణను వినియోగించుకున్నారు. వీరిలో పలువురు మంచి ర్యాంకులు సాధించారని అధ్యాపకులు గుత్తుల వీరబ్రహ్మం, వైవివి.రమణ తెలిపారు. కందిబొట్ల గుణలక్ష్మి ప్రియ 101 మార్కులతో రాష్ట్రస్థాయిలో 834 ర్యాంకు, జొన్నకూటి ఐశ్వర్య 90 మార్కులతో 2,049 ర్యాంక్, బలుసు రవిశివతేజ 89 మార్కులతో 2,309వ ర్యాంక్ సాధించారన్నారు. వీరితో పాటు 10వేల లోపు ర్యాంకులను 10 మంది, 25 వేల లోపు ర్యాంకులను 15 మంది సాధించారన్నారు. మొత్తంగా 110 మంది క్వాలిఫై అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల అధికారులు, బిసి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు లోకేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు వాసా దుర్గాప్రసాద్, వాకా గోవిందరాజు , కర్రోతు రాజశేఖర్, గుత్తుల నాగరాజు తదితరులు అభినందించారు.

కార్టూ'నిజం'




వారి కలయిక అపూర్వం

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

భీమనపల్లి శ్రీ శిరంగు రంగనాయకమ్మ జడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒక్కచోట కలిశారు. వారు చదువుకున్న పాఠశాల వేదికగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 40 ఏళ్ల తరువాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంత కుటుంబ సభ్యులతో ఒకే చోటకు చేరడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు పలకరించుకొని చిన్ననాటి సంగతులన్నీ గుర్తు చేసుకుంటూ మురిసిపోయారు. ఆటపాటలతో సందడి చేశారు. భీమనపల్లికి చెందిన గిడుగు రుద్రరాజు ప్రస్తుతం ఎపిసిసి అధ్యక్షుడిగా పనిచేస్తుండగా అదే గ్రామానికి చెందిన దేశంశెట్టి లక్ష్మీనారాయణ జడ్‌పిటిసిగా బాధ్యతలు నిర్వహించారు. అలాగే పూర్వ విద్యార్థులు ఎమ్‌డి.నజీర్ ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్‌గా, డాక్టర్ పోతుల దుర్గాప్రసాద్ రంగరాయ మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, సబ్బతి దుర్గాప్రసాద్ టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు 12 మందిని వారు ఘనంగా సత్కరించారు. జడ్‌పిటిసిగా పనిచేసిన దేశంశెట్టి లక్ష్మీనారాయణ సతీమణి నాగరత్నకుమారి ప్రస్తుతం భీమనపల్లి ఎంపిటిసి సభ్యురాలుగా ఉండగా ఆదివారం ఆమె పుట్టినరోజు కావడంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కేక్ కట్ చేయించారు. ఎపిసిసి అధ్యక్షురనిగా నియమితులైన తమ స్నేహితుడు గిడుగు రుద్రరాజును కూడా పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అప్పట్లోనే విద్యకున్న విలువలను గుర్తించి కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని దానంగా ఇచ్చి ఉన్నత పాఠశాల నిర్మించిన శిరంగు సత్తిరాజు మనుమడు ప్రస్తుతం సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న శిరంగు సత్తిరాజు(బాబు), పూర్వ విద్యార్థులను ఒక చోటకి చేర్చిన పొన్నపల్లి సత్యనారాయణశర్మ సత్కరించారు. భీమనపల్లికి చెందిన కడిమి సుబ్బలక్ష్మికి సాయం అందించారు.



చాలా సంతోషంగా ఉంది



40 ఏళ్ల తరువాత స్నేహితులందరినీ కలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది. రాజకీయంగా ఎన్ని పనులున్నప్పటికీ ఇంతటి చక్కటి అవకాశాన్ని వదులుకోవడం ఇష్టం లేక పనులన్నీ పక్కనపెట్టి ఇక్కడకు వచ్చాను. అరుదైన ఈ స్నేహితుల కలయిక, అనుభూతులు జీవితంలో మర్చిపోలేను.

- గిడుగు రుద్రరాజు, ఎపిసిసి అధ్యక్షులు

ఎన్నోఏళ్ల కృషి ఫలించింది



తాము చదువుకున్న బ్యాచ్ విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నాం. ఆ ప్రయత్నం నేడు ఫలించింది. ఇక మీదట కూడా తామంతా తరచూ కలుసుకుంటూ మంచి కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుంటాము.

- దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ జడ్‌పిటిసి, భీమనపల్లి.

రాముకు విశిష్ట బహుమతి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన ప్రముఖ వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము విశిష్ట బహుమతిని అందుకున్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలి తెలుగు వ్యంగ్య చిత్రకారులు తలిశెట్టి రామారావు జయంతిని పురస్కరించుకుని తెలుగు కార్టూనిస్టుల దినోత్సవాన్ని సత్కళా భారతి, హాస్యానందం మాసపత్రిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా హాస్యానందం నిర్వహించిన కార్టూన్స్ పోటీలో ఆయన ఈ బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 200లకు పైగా కార్టూనిస్టులు పాల్గొన్నారు. హాస్యానందం సంపాదకుడు పాండా రాము, న్యాయనిర్ణేతలు ప్రఖ్యాత కార్టూనిస్టులు బినిమ్, సరసి, మృత్యుంజయ, లంక లక్ష్మీనారాయణలతో పాటు ప్రముఖ సినీ నటుడు ఎల్‌బి.శ్రీరామ్, దైవజ్ఞ శర్మ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని తెలిపారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుకు గురై.. చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - యానాం

పాము కాటుకు గురై చికిత్సపొందుతూ ఆదివారం విద్యార్థి మృతిచెందినట్టు కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపారు. ఈ నెల 13న దరియాలతిప్ప బాలయోగి కాలనీకి చెందిన ఆలపాటి సంజయ్ స్థానికంగా ఉన్న సీతారామ నగర్లో సంచుల ఫ్యాక్టరీ ఆవరణలో తన స్నేహితులతో క్రికెట్ ఆడుతుండగా క్రికెట్ బాలు తేవడానికి వెళ్లాడని,. అయితే అక్కడే ఉన్న అగ్గిపొడ పాము రెండుసార్లు కరిచిందన్నారు. అతనిని చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషతీవ్రత ఎక్కువకావడంతో మెరుగైన చికిత్స అందించినప్పటికి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని తెలిపారు. సంజయ్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. మృతుని తండ్రి శ్రీనివాసరావు కొన్నేళ్ల క్రితం మృతిచెందాడని, తల్లి కుమారి సంరక్షణలోనే సంజయ్ ఉన్నాడని తెలిపారు. ఎఎస్ఐ రేఖాడి నాగేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆలపాటి సంజయ్ (ఫైల్)

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని జి.మేడపాడు-బిక్కవోలు స్టేషన్ల నడుమ రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని సుమారు 40 ఏళ్ల వయసుగల వ్యక్తి మృతదేహం లభించినట్లు సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం రైల్వే లోకో పైలట్, రైల్వే కీ మన్లు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మృతుడు ఐదు అడుగుల ఎత్తు ఉండి, వంటిపై ఆలివ్ గ్రీన్ మీద నలుపు తెలుపు గీతలు గల ఫుల్ హ్యాండ్ షర్ట్, లైట్ స్కై కలర్ టీ షర్టు, గ్రే కలర్ ప్యాంటు, బ్లూ రంగు బెల్టు ధరించి ఉన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కాకినాడ ఆర్‌పిఎఫ్ ఓపి ఎస్ఐ ఎన్.రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలం మురారి గ్రామంలో మోటార్ సైకిల్, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్టు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం గోరక్షణ పేటలో ఎస్‌బిఐలో లోన్ ఏజెంట్‌గా పని చేస్తున్న కొమ్మను సురేష్ మోటార్ సైకిల్‌పై ఈ నెల 17వ తేదీన సాయంత్రం 6:30 గంలకు రాజమండ్రి నుండి మురారి తన పిన్ని గారి ఇంటికి వస్తుండగా అదే సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ అతనికి ఎదురుగా రివర్స్‌లో తన వాహనాన్ని వేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి మోటర్ సైకిల్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న కొమ్మన సురేష్, అతని స్నేహితుడు జట్టా శ్రీనివాస్‌కు ఇద్దరికీ గాయాలయ్యాయి. వారిద్దరూ రాజమహేంద్రవరం చక్రధర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కొమ్మను సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై గండేపల్లి ఎస్ఐ వై.గణేష్ కుమార్ ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల పరిధిలోని కాట్రావులపల్లిలో ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలోని గోదావరి నదిలో ఈ నెల 19న గల్లంతైన ఇటుకబట్టీ కార్మికుడు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నారాయణ పట్నానికి చెందిన తంగిడి సోబనా (56) మృతదేహం ఆదివారం లభ్యమైంది. కోరుమిల్లి -కూళ్ల మధ్య గోదావరి నదిలో సోబనా మతదేహాన్ని గజ ఈతగాళ్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యానాం వార్తలు


లక్ష్మీ స్నేహ, ఆర్ఎఒ మునిస్వామి, సమక్షంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

260 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని స్థానిక జాకీర్ హుస్సేన్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ స్కూల్లో లయన్స్ క్లబ్ యానాం పిల్లరాయ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ ఇనోదయ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సతీమణి లక్ష్మీ స్నేహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో పేదలకు సేవలు అందించినట్టే క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని నిర్వహించాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు పులవర్తి శ్రీను మాట్లాడుతూ క్లబ్ ఏర్పాటై మొదటి కార్యక్రమంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరంలో 260 మందికి బిపి, షుగర్, ప్రసూతి, ఎముకలు, చెవి, ముక్కు, గొంతు, గుండె వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. అనంతరం వైద్య సేవలందించిన డాక్టర్లు డివిఎస్ ప్రకాష్, కె.సత్య సౌజన్య, డివి గురుకిరణ్, నితీష్ సింగ్, ఆర్ సాయి అంజని, శరణ్‌లను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, హెల్త్ అసిస్టెంట్ డైరెక్టర్ పలాసకుమార్ సన్యాల్, ఎస్‌పి రఘునాయుగం, సిఐ షణ్ముగం, చిక్కాల నరసింహమూర్తి, డివివి సత్య నారాయణ, దూళిపూడి సతీష్ చంద్ర, నవీన్, గొల్లపల్లి వీర్రాజు, పండు సిద్ధార్థ కుమార్, కాకి నాగేశ్వరరావు, చెక్కల అరుణ్ కుమార్, తిరుమల నాయుడు,భార్గవ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళి

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి, ఎస్‌పి రఘునాయుగం, సిఐ షణ్ముగంలు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.


నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, ఎస్‌పి రఘునాయిగం

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- మే 24 నుంచి జూన్ 1 వరకు నిర్వహణ
- హాజరు కానున్న 52,571 మంది విద్యార్థులు

ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి నరసింహం





ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాటు పూర్తి చేసినట్టు ఆర్ఐఒ నరసింహం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 98 కేంద్రాల్లో వీటిని నిర్వహించనున్నారు.

● 24 నుంచి జూన్1 వరకూ నిర్వహణ

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు నిర్వహించనున్నాము. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవంత్సరం విద్యార్థులకు మధ్యా హ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతరియ. విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు ఆయా రూట్లలో ఉదయం 6 గంటల నుంచే ఆర్‌టిసి బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటాయి.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52,571 మంది హాజరు

సప్లిమెంటరీ పరీక్షలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 52571 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి 1 గంట ముందుగా వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోము. ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనంలో ఉంచుకోవాలి.

● అన్ని శాఖల సహకారం కోరాం

పరీక్షల నిర్వహణకు తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లతో ఇప్పటికే సమన్వయ సమావేశాలు నిర్వహించాము. అన్ని శాఖల సహకారం కోరాం. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసేందుకు తగు సూచనలు చేశాం. తాగునీరు, శానిటేషన్, నిరంతర విద్యుత్తు సరఫరాపై సంబంధిత అధికారులను కోరాము. మెడికల్ శాఖ ద్వారా తగిన అత్యవసర మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ క్యాంపు ఏర్పాట్లపై సూచనలు చేశాం. రెవెన్యూ, పోలీసు శాఖ ద్వారా 144 సెక్షన్ అమలు, భద్రత, బందోబస్తుపై ఆదేశాలిచ్చాము.

● జిల్లాల వారీగా కేంద్రాల ఏర్పాటు

తూర్పు గోదావరి జిల్లాలో 36 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేశాం. రాజ మహేంద్రవరం డివిజన్‌లో 14,768 మంది, కొవ్వూరు డివిజన్‌లో 4,568 మంది మొత్తం 19,336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కాకినాడ జిల్లాలో 37 కేంద్రాల్లో 21,120 మంది, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 27 కేంద్రాల్లో 14,257 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 7 కేంద్రాల్లో 2,426 మంది విద్యార్థులు పరీక్షలకు హజరు కానున్నారు. ఈ జిల్లాలో మొత్తం 16 స్టోరేజ్ పాయింట్స్ ఏర్పాటు చేశాం.

● నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది కేటాయింపు

సజావుగా పరీక్షల నిర్వహణ కోసం 196 మంది అధికారులు, సిబ్బందిని నియమించాం. జిల్లాలో మొత్తం 5 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 5 సిటింగ్ స్క్వాడ్స్‌ను నియమించాము. వీరు పరీక్షాకేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.

పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - పెదపూడి

నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలందరికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. పెదపూడిలో రూ.11లక్షలతో కొత్తగా నిర్మాణం చేసిన బోరువెల్, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి కాలం మండలంలోని గ్రామాల్లో సుమారు రూ.15 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో తాగునీటికి సంబంధించి పైపులైన్లు ఆధునికీకరణ, నూతన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం, ఇంటింటికి కుళాయి మొదలగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, మండల సర్పంచుల సమైక్య అధ్యక్షులు కోసూరి వాసు,ఎంపిటిసి సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, వైసిపి మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, సామాజిక ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కాకర సాయిబాబు, కోరా వీర్రాజు చౌదరి, పార్టీ గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు పాల్గొన్నారు.


బోర్వెల్ ట్రాన్స్ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ సూర్యనారాయణ రెడ్డి

పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

కౌలు రైతుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వైసిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కంటే వీరరాఘవ రావు అన్నారు. వడ్లమూరులోని ఆర్‌బికెలో ఆదివారం కౌలు రైతులకు సిసిఆర్‌సిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సిసిఆర్‌సి సర్టిఫికెట్‌ను ఉన్న కౌలు రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేందుకు, ఇన్పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం తదితర సదుపాయాలు పొందగలుగుతారన్నారు. ఈ సర్టిఫికెట్ లేని కౌలు రైతులు రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదిస్తే ఈ కార్డుకు సంబంధించి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ అక్షయ్,మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్‌వి ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ శ్రీవాణి, కౌలు రైతులు పాల్గొన్నారు.


కౌలు రైతుల సదస్సులో మాట్లాడుతున్న వీర రాఘవరావు

చక్కని జీవనశైలితో ఆరోగ్యం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సరైన పోషకాహారం తీసుకుంటూ రోజు శారీరక వ్యాయామం చేస్తూ చక్కని జీవనశైలిని అలవరచుకుంటే రోగాలు దరి చేరవని డాక్టర్ కుమార్ యాదవ్ తెలిపారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక ఆరోగ్యానికి ప్రోటీన్లు అధికంగా ఉండే బ్రౌన్ రైస్, చేపలు, పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడంతో పాటు తగినంత నీటిని తాగాలని డాక్టర్ యాదవ్ తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో అడబాల రత్న ప్రసాద్, వాసిరెడ్డి శివ, బడే వెంకటకృష్ణ, అడబాల సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కుమార్‌యాదవ్

లయన్స్ కేబినెట్ సభ్యులకు 'అభ్యాస్'

ప్రజాశక్తి - తాళ్లరేవు

లయన్స్ జిల్లా 316 బి, 2023-2024 కేబినెట్ సభ్యులకు 'అభ్యాస్' తరగతులు తాళ్ళరేవు మండలం గోవలంక రిసార్ట్స్ లో నిర్వహించారు. లయన్స్ జిల్లా నూతన గవర్నర్‌గా ఎన్నిక కాబోయే లయన్ వేలూరి సూర్య నారాయణ (2023-2024), ఆయన కాబినెట్ సభ్యులు లయన్స్ ఇంటర్నేషనల్ లక్ష్యాల సాధనపై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్‌లో నూతన సభ్యులను చేర్పించటం, నూతన క్లబ్‌లను ఏర్పాటుపై అవగాహన కల్పించారు, కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ అనిల్ కుమార్ షేట్, బాదం బాలకృష్ణ, మంజులూరి విశ్వేశ్వరరావు, దాసరి తిరుమలరావు, ఇవివి ఈశ్వర్ కుమార్, వజ్రపు కోటేశ్వరరావు, వినోద్, దత్తు, చిట్నీడి శ్రీనివాస్, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి, పెద్దిరెడ్డి ఉమా మహేశ్వరరావు, ధూళిపూడి బాబి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న లయన్స్ గవర్నర్ వేలూరి సూరిబాబు

పెద్దేవంలో వేధిస్తున్న డ్రెయినేజీ సమస్య

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఎంతోకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యను జగనన్నకు చెప్పినప్పటికీ దాని నిర్మూలన కోసం అధికారులు మాత్రం నిధులు లేవంటున్నారని మండలంలోని పెద్దేవం గ్రామ ఎస్‌సి కాలనీకి చెందిన ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ పరిధిలోని రెండు వార్డులు ఉన్న ఈ కాలనీలో ప్రజలు ఎంతోకాలంగా డ్రైనేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఎన్నిసార్లు సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం ద్వారా తెలియజేశామన్నారు. అధికారులు వచ్చి దీన్ని పరిశీలించినప్పటికీ సమస్య నివారణకు నిధులు లేవనంటున్నారని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్య కారణంగా మురుగునీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో పాటు చిన్నపాటి వర్షం పడిన రోడ్డంతా నీటితో నిండి ఉంటోందని వాపోతున్నారు. ఈ సమస్య వల్ల దుర్వాసన పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆ ప్రాంత వాసి పెస్మా సంగం నాయకులు గెద్దం విజయభాస్కర్ తెలిపారు. ఈ సమస్యను జగనన్న దృష్టికి తీసుకు వెళ్లడంతో సచివాలయ అధికారులు వచ్చి పరిశీలించి నిధులు లేవని చేతులు దులుపుకున్నారని అప్పటివరకు తమ పరిస్థితి ఇంతేనా అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పెద్దేవంలో రోడ్డుపై మురుగునీరు

సబ్ ప్లాన్ చట్టంపై ప్రచారోద్యమం

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టంపై ఈ నెల 23 నుంచి ప్రచారోద్యమం నిర్వహించనున్నట్టు దళిత బహుజన మహిళ శక్తి కన్వీనర్ కొంకి రాజామణి తెలిపారు. ఈ మేరకు ముద్రించిన కరపత్రాలను ఆమె ఆదివారం డిబిఎంఎస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సబ్‌ప్లాన్ నిధుల దారిమళ్లింపును ఆమె ఖండించారు. సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వత చట్టంగా చేసి ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ప్రచార రథయాత్రను చేపడుతున్నామన్నారు. 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు అమలాపురం గడియారస్తంభం సెంటర్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. 24న ముమ్మిడివరం, 25న పి.గన్నవరం, 26న కొత్తపేట, 27న రాజోలులో పర్యటిస్తుందన్నారు. రాజోలు ముగింపు సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఎస్తేరు రాణి, జల్లి మహాలక్ష్మి, బొంతు నాగమణి, అంబటి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళలు


వెలువలపల్లిలో తాటాకు విసన కర్రలు విక్రయిస్తున్న వ్యక్తి

విసనకర్రలకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి - అయినవిల్లి

తరచూ విద్యుత్ కోతలు, దానికి తోడు ఉక్కబోతల నేపథ్యంలో తాటాకు విసినకర్రలకు డిమాండ్ పెరిగింది. అయినవిల్లికి చెందిన వ్యవసాయ కార్మికుడు పనులు లేక తనకు చేతనైన తాటాకులతో విసనకర్రలు తయారుచేసి ఆదివారం మడలంలోని వేలువలపల్లి గ్రామంలోనీ రామాలయం వీధిలో విక్రయించాడు. ఒక్కో విసనకర్ర రూ.20 నుంచి రూ.30 వరకూ పలికింది. హాట్ కేకుల్లా ఇవి సేల్ అయ్యాయి.

నేడు వాలంటీర్లకు వందనం

ప్రజాశక్తి-గోపాలపురం

సోమవారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు మండల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

కోతుల బెడదతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురంలో కోతుల బెడద అధికంగా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పలువురు మాట్లాడుతూ గోపాలపురంలో మసీదు వెనుక, బస్టాండ్ సెంటర్లలో, శివాలయం వద్ద, ప్రభుత్వ కార్యాలయం వద్ద, ప్రభుత్వ పాఠశాలలు, పోస్ట్ ఆఫీస్, అనేక ప్రాంతాలలో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇళ్లల్లోకి అవి చొరబడి, ఇళ్లను, వస్తువులను, వాహనాలను ధ్వంసం చేస్తున్నాయని, కరిచేందుకు మీదకు దూకుతున్నాయని, పిల్లలను గాయపరిచేందుకు వస్తున్నాయని వాపోతున్నారు. ఇళ్ల వద్ద ఉన్న అనేక వస్తువులను ధ్వంసం చేస్తున్నాయని, వాటికి కావలసినవి పట్టుకుని వెళ్ళిపోతున్నాయన్నారు. రోజురోజుకు కోతుల నుంచి అధికమవుతున్నాయని తెలిపారు. కోతులు గ్రామంలో ఒక చొరబడి అటు ఇళ్లల్లోనూ, బస్టాండ్ లోను, గుడులు వద్ద కొబ్బరి చిప్పలు తినేందుకు ప్రభుత్వ కార్యాలయంలో కోతులు సంచరించడంతో వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. వస్తువులను ఎత్తుకు వెళ్ళిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల నుండి సమస్య అధికంగా ఉందని చిన్నపిల్లలు, పెద్దలు పైన కోతులు గాయపరుస్తున్నాయని అన్నారు. సంబంధిత అధికారులు వాటిని అటవీ ప్రాంతంలోకి తరలించాలని కోరారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న కోతులు

మాజీ ఎంపిపి శ్రీరామ్‌జీకి పితృ వియోగం

ప్రజాశక్తి- కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మాజీ ఎంపిపి నెక్కంటి శ్రీరామ్‌జీకి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి నెక్కంటి శ్రీహరి(75) శనివారం రాజమండ్రిలో మృతి చెందారు. ఆయన ఏలూరు సిఆర్.రెడ్డి కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేశారు. సమాచారం తెలుసుకున్న పలువురు ప్రముఖులు కపిలేశ్వరపురంలోని శ్రీరాంజీ స్వగృహానికి వచ్చి మృతుని శ్రీహరికి నివాళులర్పించారు. ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి వివివిఎస్.చౌదరి, గంటి హరీష్‌మాథూర్, సర్పంచ్ సాకా శ్రీనివాస్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.


నెక్కంటి శ్రీహరి


మొక్కలు పంపిణీ చేస్తున్న చైర్మన్ రామకృష్ణ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి -మామిడికుదురు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ కోరారు. అప్పనపల్లి బాల బాలాజీ ఆలయ ఆవరణలో అటవీ శాఖ సమకూర్చిన మొక్కలను ఆదివారం భక్తులకు ఉచితంగా ఆయన పంపిణీ చేశారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యానాం

యానాం గౌతమీ గోదావరి నదిలో దూకి ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు. కాకినాడ మాధవ పట్టణానికి చెందిన గుబ్బల శ్రీహరి ఆదివారం గోదావరిలో దూకడానికి ప్రయత్నించాడని వెంటనే పోలీసులు చూసి రక్షించారని తెలిపారు. అనంతరం అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

అన్నదాన నిధికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

బాలబాలాజీ శాశ్వత అన్నదాన నిధికి అల్లవరం మండలానికి చెందిన పరమట అంజనేయులు, శశిరాణి దంపతులు రు.10,116లు విరాళం అందించారనికార్య నిర్వహణాధికారి డి.శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. దాత దంపతులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాన్ని చైర్మన్ చిట్టూరి రామకృష్ణ అందచేశారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభినందించారు.